"మీకోసమే! మీరు ఎప్పుడూ డబ్బులేదు అని అనుకునే రోజు రాకూడదు అని నా తాపత్రయం" అనేది.

ఓకే....ఓకే" అనేవాడతను అంగీకరిస్తూ.

ఒక వారం రోజుల్లో, యిద్దరూ యింటికి కావాల్సిన సామాను మొత్తం తెచ్చేసారు. సుధీర్ త్వరగా అలిసిపోయేవాడు. స్వప్న యేదో సర్దుతుంటే, "రేపు సర్దవచ్చు. వచ్చి పడుకో" అనేవాడు. స్వప్న అతని బలవంతంమీద వచ్చి పడుకునేది.

అతను దగ్గరకు తీసుకుని జుట్టు నిమురుతూ, "స్వప్నా! ఎక్కువ అలిసిపోవద్దు" అంటూ మందలించేవాడు. స్వప్న బుద్ధిమంతురాలిలా అతని పక్కన పడుకుని నిద్రపోతున్నట్లు పడుకునేది.

సుధీర్ నిద్రపోయేవాడు. స్వప్న మెల్లగా లేచివచ్చేది. చప్పుడు లేకుండా సామాను సర్దేది. ఇల్లు అడ్డదిడ్డంగా వుంటే స్వప్నకి చాలా చిరాగ్గావుండేది.

అర్ధరాత్రివేళ ఏదో చప్పుడయితే అలికిడికి సుధీర్‌కి మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూస్తే పక్కన స్వప్న లేదు. వంటయింట్లో సర్దుతోంది.

వెనకనుంచి వెళ్ళి అమాంతం నడుంచుట్టూ చేయివేసాడు.

స్వప్న కెవ్వుమంది. తిరిగిచూస్తే సుధీర్!

"ఎక్కువ పనిచేయవద్దని చెప్పానా!"

"నాకు నిద్రరాలేదు"! తప్పుచేసినదానిలా తల దించుకుంటూ అంది.

అతను స్వప్నను అమాంతం చేతులతో ఎత్తుకుని తీసుకువచ్చి మంచంమీద కూలేసాడు.

"చెప్పినమాట వినవనుకో! శిక్షేమిటి తెలుసా?" చూపుడువేలు చూపించాడు.

"ఏమిటి?" నిర్భయంగా అడిగింది.

"నేను యింటికి రాను!"

"మైగాడ్!" కళ్ళు పెద్దవిచేసి చూపిన స్వప్న వెంటనే గట్టిగా చెంపలు వేసుకుంటూ "ఎప్పుడూ, పొరపాటుగాకూడా ఆ పనిచేయకన్నట్టు" తలమీద చేయి పెట్టుకుంది. అతను స్వప్నని లాగి పడుకోబెట్టాడు. తను పక్కకి తిరిగి స్వప్న గుండెల మీద తల ఆనించి పడుకున్నాడు.

"యికనుంచి యిలాగే నిద్రపోతాను! ఎందుకో తెలుసా. నువ్వు కాస్త లేస్తావనుకో! నాకూ మెలకువ వచ్చేస్తుంది."

మరి కొంతసేపటికి అతను నిద్రపోయాడు. స్వప్న అతని తలమీద చేయివేసి నిమురుతూ వుండిపోయింది! స్వప్నకి హఠాత్తుగా అనిపించింది.

"ఇతను నాకెంత సంతోషం ఇస్తున్నాడు.ఇతనికి నేనేం ఇవ్వగలుగుతున్నాను!"

స్వప్న నిట్టూర్చింది. నేనేదయినా మంచి పనిచేసి, యీ సర్వ ప్రపంచంచేత కొనియాడబడి, సుధీర్‌కి గర్వకారణం అయితే ఎంత బాగుంటుంది.

స్వప్నకి నవ్వు వచ్చింది. ఎంత పెద్ద దురాశకదూ!" అనుకొంది.

(ఇంకా వుంది)



# లోపం ఎక్కడ ఉంది?

## శ్రీరంగం

పొడవైన వరండా, కొద్దిగా మాసినా ఇంకొన్ని రోజులవరకూ సున్నం అక్కరలేదన్నట్లు వున్న గోడలు. రెండుప్రక్కలా క్రమంలో అక్కడక్కడా తెల్ల పెయింటు ఊడి నల్లని మచ్చలతో క్రొత్త డిజైన్లలా కనిపిస్తూన్న మంచాలు. ఒకమూల పాత టేబుల్‌పైన క్రొత్త టేబుల్‌క్లాత్. వేగంతో కేస్ షీట్లకు నంబర్లు వేస్తూ సిస్టర్ లూసీ. మంచాల్ని సగందాకే

అత్రమించి రగ్గు కప్పుకొని మూట కట్టినట్లు పడుకున్న పేషెంట్లూ-సందడిలేని తన వార్డుని మొదటిసారిగా రవి చూసాడు.

వార్డుచీఫ్ రాంబాబు బట్టతలతో, పాతకాలం నాటి కోటుతో వెనుక అసిస్టెంటు అట్టహాసంతో వార్డులోకి నడుస్తూ తన్నూ మరో ముగ్గురు హౌస్‌సర్జన్‌లనూ చూసి 'మీరంతా యీరోజే యీ వార్డులో వేయబడ్డ కొత్త హౌస్‌సర్జన్‌లు అనుకుంటాను' అని అందర్నీ ఒకే చిరునవ్వుతో పలుకరించి, 'బాయ్స్ జీవితంలో హవుసర్జనులవంటి పిరీడ్ లేదు. ఇక్కడ నేర్చుకున్న అనుభవంతో మీరు మీ భవిష్యత్తును ఏర్పరచుకుంటారు. అందుకే మీరు ప్రతి పేషెంటును క్షుణ్ణంగా పరీక్షించి, కావలసిన పరీక్షలు చేసుకుని మీకు అనుమానాలు వస్తే డాక్టరు ఆచారిని అడిగి తెలుసుకొనే స్వాతంత్ర్యం మీకు వుంది. ఈరోజు మన వోపీ రోజు, అందరూ వోపీకి రండి' అంటూ బూట్లు టకటక శబ్దంచేస్తూ పేషంట్లందర్నీ పరికిస్తూ వెళ్ళిపోయాడు.

అతనో తుఫానులా వచ్చి తిరిగి తుఫానులా వెళ్ళినట్టు అనిపించింది రవికి.

తనూ అవుట్‌పేషంటుకు నడిచాడు. వోపీ అంతా ఎలానో వుంది. అక్కడ చాలామటుకు వొత్తుగా పెరిగిన గడ్డాలతో మాసిపోయిన బట్టలతో జనం నిండివున్నారు. అది ఆసుపత్రి అనుకోనివాడికి అక్కడ పూర్‌ఫీడింగ్ జరుగబోతుందనో, లేకపోతే గ్రహణం పట్టినప్పుడు గుమ్మం ముందు సందడో అనిపిస్తుంది.

గదిలో అడుగు పెట్టగానే క్రిక్కిరిసివున్న ఆ గదిలోని ముక్కిపోయిన వాసన గుప్‌మంది. అది పేషంట్ల వొంటినుండి బట్టలనుండి వస్తూన్న వాసన. వాళ్ళమధ్య ఆచారి పెన్నూ పేపరుతో కిటికీ తలుపులు మూసేసి స్టంటు చేస్తున్నాడు.

ఊపిరి బిగపెట్టి చుట్టూ చూసేడు. బాస్ యెక్కడా కనిపించలేదు. ముగ్గురు హౌస్ సర్జనులు ఎగ్జామ్ టేబిల్‌దగ్గర బిజీగా కనిపిస్తున్నారు.

ఊపిరి సలపని యీ వాతావరణంలో కిటికీ తెరచి ఊపిరి అందుకోవాలని కిటికీ దగ్గరకు పరిగెత్తాడు.

ఎందుకో తలెత్తిన ఆచారి 'కిటిక తియ్యకు పేషంట్లు అక్కడనుంచికూడా బాధిస్తారు' అన్నాడు.

ఆచారి మాటలకు తను ఆగిపోయి "ఇలా గదంతా మనుషులతో క్రిక్కిరిసిపోతే యెలా పనిచేస్తాము సార్?" అన్నాడు.


"ఏం చేస్తాం చెప్పు. మన వోపీకి వచ్చే వాళ్ళందరూ రెక్కాడితేనే కాని డొక్కాడని మనుషులు. ప్రతీవాడు తొందరగా చూపించుకొని తొందరగా బయటపడాలనుకొనే వాళ్ళే. ఆ ఆతృతలో మన మాటల్ని ఎవ్వరూ లక్ష్యపెట్టరు" అన్నాడు ఆచారి.

తను ఎన్నో వోపీలను చూసేడు. వాటిల్లో క్రమశిక్షణ లేకపోయినా క్రమశిక్షణ గురించి ప్రయత్నం అన్నా వుంటుంది. గవర్నమెంటు ఆసుపత్రులయినా కొంచెం శుభ్రంగా కొద్దిగా డాబుగా కనిపిస్తాయి. అంతేకాని ప్రపంచం బీదా బిక్కీ అంతా ఆ నాలుగు గోడల్లోనే యిలాంటి వాతావరణంలో వున్నట్లు అనిపించదు. అసలు పని తొందరగా కానేకాదు. మరీ ఆలస్యం అవుతుంది. ఈమాటే వాళ్ళతో చెప్పడానికి ప్రయత్నించేడు. ఎవరేనా వింటేగా.

ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క భాష అర్థమవుతుంది. వీళ్ళకు అర్థం అయ్యే భాషలో వీళ్ళకు చెబితే వీళ్ళు వింటారు అనుకొని బాయ్ అని పిలిచాడు ఎవరూ రాలేదు. తనే బయటకు వచ్చి రిటైరయిన తీరుబడితో తను బీడీ తాగడానికే పుట్టేను అన్న ధోరణిలో తలుపుకు కొంచెం అవతల రోడ్డుమీద వచ్చిపోయే జనాన్నే చూస్తూ పొగ తాగుతూన్న బాయ్‌ని చేయిపట్టుకొని గుమ్మం దగ్గరకు లాక్కొచ్చి "నీస్థానం యిది తెలిసిందా!" అని కళ్ళెర్రచేసి గదిలో వున్న మనుష్యుల్ని దొరికిన వాడ్ని దొరికినట్టుగా చేయి పట్టుకుని అవతల విసిరేస్తున్నాడు. డాక్టరు కోపంకూడా పడగలడు అని మొదటిసారి తెలుసుకున్న మిగిలిన వాళ్ళు బయటకి వెళ్ళిపోయేరు. ఆఖర్నవున్న కుంటి








వాడు. గూనివాడు 'సార్ మేము యీ వార్డులోని పేషంట్లం సార్' అన్నారు.

'అయితే ఇక్కడ ఏం చేస్తున్నారు' అన్నాడు.

"ఇక్కడ మేము పేషంట్ల చిట్టీలు ఆచారి గారికి అందించడం, వాళ్ళను బల్లలు ఎక్కించడం ఎలా పడుకోవాలో చెప్పడం, యెడ్మిట్ అయినవాళ్ళని లోనికి తీసుకెళ్ళడం చేస్తూంటాము."

"అయితే మీరు బయటవుండి యెవరు యెక్కువ అవస్థలో వుంటారోవాళ్ళను మొదట పంపిస్తూండండి" అన్నాడు. వాళ్ళుకూడా బయటకు వెళ్ళిపోయారు. సాధారణంగా ప్రతీ అవుట్ పేషంటులో ఆ బాస్ విధిగా కూర్చుంటారు. అడ్మిషన్స్ అన్నీ అతని చేతిలోనే వుంటాయి. తనకు కావలసినవి తను యెడ్మిట్ చేసుకొని బహుకొద్ది బెడ్లు అసిస్టెంటుకి వదిలేస్తారు. ఈ పేషంట్సుకూడా చాలా విచిత్రంగా వుంటారు. వాళ్ళకు బాసేతప్ప యిరకెవరూ డాక్టరుకారు అనిపిస్తుందేమో ప్రతి చిన్నబాధకీ బాస్ పరీక్షచేయాలంటారు. వోపీలో తమలాటి హౌస్‌సర్జన్‌ల పని యెవ్వరికీ యింటరెస్ట్ లేని కేసులు చూడడం. రిపీట్ అన్న అక్షరాలు టిక్కెట్లలో రాయడం.

కాని యిక్కడ తామూ, తమలో కలిసిపోయిన ఆచారీ ఈ వార్డుకి పెద్దంటే యేదో గర్వం అనిపించింది. ఆ గర్వంతోనే కుర్చీలో కూర్చున్నాడు.

గూనివాడు గుమ్మంలోంచి తల యివతలకు పెట్టి 'పంపించమంటారా' అని అడిగాడు.

తను తల ఆడించాడు. వాడు ఎవర్నో తీసుకొచ్చి తన ముందుంచేడు.

తను 'ఏంటి బాధ?' అని అడిగేడు.

వాడో కట్ట పాతకాయితాలు అందించాడు. సగం చిరిగివున్న ఆ కాయితాలు సేఫ్టీపిన్నులో బంధించబడి వున్నాయి. కాగితాలు తిప్ప సాగేడు. ముక్కలుగా చేతికి రాసాగాయి. ఇక వీటిని చూడడం తన వల్ల కాదని వాటిని ప్రక్కకు నెట్టి 'ఏంటి బాధ?' అన్నాడు.

"వీడికి బ్లడ్ ప్రషర్ సార్' అన్నాడు గూనివాడు.

ఎవరి బాధ వాడు చెప్పుకోవాలిగాని, ఇంకొకడు యిలా చెబితే చిరాకు అనిపిస్తుంది.

"నువ్వు అవతలికిపో!" అని మాటలతోనే నెట్టాం అనుకున్న రవి కొంచెం సహనం చూపిస్తూ, వాడి బ్లడ్‌ప్రెషర్ చూసేడు. రెండు

వందలు వుంది. ఒక నిముషం ఆలోచించి "ఎక్కువే వుంది. యెడ్మిట్ అవుతావా?" అన్నాడు.

"ఎంత వుంది సార్!" అన్నాడు గూని వాడు.

"చెపితే నువ్వు తగ్గిస్తావేంటి" అని విసురుగా అనేటప్పటికి 'సార్ వాడికి బ్రహ్మ చెముడు సార్. మీరు ఏం మాట్లాడినా వినపడదు. అందుకే....' సంజాయిషీలాగచెప్పేడు తను వాడి బదులు ఎందుకు మాట్లాడుతున్నాడో.

తను అనవసరంగా విసుక్కున్నానా నన్న పశ్చాత్తాప స్వరంతో 'రెండు వందలు ఉంది' అన్నాడు తల ఎత్తకుండానే.

"అది వీడికి మామూలే సార్. అంతకంటే ఎక్కువయితే అప్పుడు అడ్మిట్ చేసుకోవచ్చు" అన్నాడు.

"అవుతే ఏం చేయమంటావు?" అన్నాడు.

"తలూపేయండి! తృప్తిగా వాడే వెళ్ళిపోతాడు."

"ఇదేదో కొత్త టెక్నిక్‌లా వుందే!" అని తలూపేడు. వాడు లేచి కృతజ్ఞతతో గూని వాడికి సలాంచేసి వెళ్ళిపోయేడు.

తర్వాత అతను ఎంటిపోయి చాలా శోచనీయంగా అన్నాడు. ఇతన్ని ఎడ్మిట్ చేసుకోవాలి. కాని యింతకంటె ముందు ఆచారి నించి యెన్ని బెడ్లు ఖాళీ ఉన్నాయో తెలుసుకోవాలి. 'ఈరోజు ఎన్ని బెడ్లు ఖాళీగా ఉన్నాయి సర్' అన్నాడు.

ఆచారి ఆలోచిస్తున్నాడు. కుంటివాడు తొణకకుండా 'పది' అన్నాడు. తల ఎత్తేటప్పటికి కుంటివాడు మాటలుకు తడుముకుంటూ 'నిన్న ఆచారిగారు ఏవీ కేసులు పంపించవొచ్చో అనుకుంటూంటే....విని లెక్క కట్టేను సార్' అన్నాడు.

వాడి భయానికి నవ్వొచ్చింది.

సరే అని "వీడ్ని ఎడ్మిట్ చేసిరా" అన్నాడు.

"రా తమ్ముడూ" అంటూ వాడ్ని తీసుకెళ్ళేడు కుంటివాడు.

వోపీకి వచ్చిన వాళ్ళని వీళ్లు తమ్ముడో, అన్నో అనో పలకరిస్తున్నారు. ఆ పలకరింపు తమ్ము కనిపెట్టుకునేవారు వున్నారు అన్న భావన పేషెంట్లకు కలుగజేస్తుంధి.

పదకొండు గంటలకు అవుట్ పేషెంట్లని చూడ్డం పూర్తయింది. తను లేస్తూ "మీరు టీ తాగిరండి" అంటూ అర్ధరూపాయి ఇచ్చేడు.

"ఒద్దుసార్" అన్నారు వాళ్ళు వొక్కుమ్మడిగా.

బలవంతంగా వాళ్ళ చేతుల్లో ఉంచి 'రండి సార్! మనం అలా వెళ్ళి కాఫీ తాగి వార్డుకి వెళదాం' అన్నాడు ఆచారితో.

త్రోవలో ఆచారి 'ఎలా వుంది వోపీ' అంటూ అడిగేడు రవిని.

"బాగుంది సార్ తమకు అన్యాయం జరుగదు అన్న ధీమాతో ప్రతీవాళ్ళూ మన ఓపీకి వొస్తున్నారు సార్. గవర్నమెంటు ఆసుపత్రుల్లో యిలాంటి తృప్తి పేషెంట్లకు ఉండడం చాలా అరుదు" అన్నాడు.

ఆచారి "అవునోయ్ పేషంట్లు ఆ భావనతో వుంటేనే మనకు జాబ్ శాటిస్‌ఫేషన్ అంటూ వుంటుంది. మన ఓపీలో జబ్బును జబ్బుగానే చూస్తాం అంతేగాని జబ్బు వెనుకనున్న మనిషిని చూడం" అన్నాడు.

రవి ఆచారిని చూసేడు. ఖాదీచొక్కా, కాటన్‌పేంటు. తల చుట్టుప్రక్కల అంతా నెరసి వుంది. వయస్సు నలభై అయిదు దాటక పోయినా వార్థక్యం తాలూకు అలుపు ముఖంలో గోచరిస్తూంది.

"సార్ మీ క్లినిక్ యెక్కడ?" అని అడిగేడు రవి.

ఓపీ వైపు చేయి చూపిస్తూ 'అదేనోయ్ నా క్లినిక్కు.'

"అది కాదు సార్ యింటి దగ్గర ప్రాక్టీసు...."

"అలాంటిది ఏమీ లేదు."

"ఎందుకు సార్?" అన్నాడు.

"డాక్టరుకు డబ్బు యెప్పుడు అయితే యిస్తారో యిచ్చిన వాళ్ళు డాక్టరుమీద యేదో అధికారం సాధించేం అనుకుంటారు. అలా అనుకొని వాళ్ళ స్థాయి మరచిపోతుంటారు. అది నాకు యిష్టంలేదు."

అందుకన్నమాట యీ ఆచారి అవతారం యిలా వుంది. ఖరీదైన బట్టలు లేవు ఆఖరికి రావడానికి స్కూటర్ కూడా లేదు.

ఇద్దరు అయ్యరు హోటల్లో కూర్చున్నారు. తమని చూస్తూ అయ్యరు వొక నమస్కారం పారేసి సర్వర్ని పంపించేడు, స్పెషల్‌గా చూడమని.

"రెండు కాఫీ" అన్నాడు ఆచారి. రెండు నిమిషాల తర్వాత వాడు కాఫీ తెచ్చేడు. 'తీసుకోండి' అని సిప్ చేయడం మొదలు పెట్టేడు.

"సార్!" అన్నాడు కాఫీ పెట్టి కదలని సర్వరు ఆచారి నుద్దేశించి.

"ఏంటి?" అన్నట్లు తల ఎత్తి చూసేడు ఆచారి.

"గజ్జల్లో కురుపులు సార్."

తనకు చిరాకెత్తుకొచ్చింది. తింటుండే సమయంలో యెవరేనా తమ బాధ చెబితే తినే వస్తువు చాలా అసహ్యం అనిపిస్తుంది.

ఆచారి మాత్రం ఏ భావం లేని ముఖంతో ఆసుపత్రి వైపు వేలు చూపిస్తూ 'డాక్టరు అక్కడరా! యిక్కడ కాదు' అన్నాడు.

"సార్ వీళ్ళకు వేళాపాళా లేదా?" అన్నాడు రవి.

"లేదోయ్ వీళ్ళకు డాక్టరు డబ్బు పారేస్తే ఏం చేస్తాడు చూడక చస్తాడా' అన్న నమ్మకం ప్రబలిపోయిందోయ్. ఆ నమ్మకాన్ని కలించిన వాళ్ళం మనమే. అందుకే వీళ్ళు మహా దారుణంగా ప్రవర్తిస్తారు. మనం జబ్బును జబ్బుగా ఏ నాడు చూడగలమో ఆ రోజే డాక్టరు వృత్తికి వొక వ్యక్తిత్వం హోదా అంటూ వుంటుంది."

"ఇది మహాదారుణం సార్."

"వ్యక్తిత్వపు విలువలు అంటూ వున్న వాడికి" అంటూ కాఫీ పూర్తిచేసి పద అన్నాడు.

ఆచారి ఫైనలియర్ క్లాసు తీసుకోనేందుకు వెళ్ళిపోయేడు. గూనివాడు, కుంటివాడూ యెవరినీ గమనించే స్థితిలో లేనేలేరు. వాళ్ళు పేషంట్లకు బట్టలు తొడగటం, మంచాలకు

అగ్రశ్రేణి అంతర్జాతీయ మేధావుల ఆలోచనా మథనం!

'వాకాటి' నిర్వహణలో

సరికొత్త తరహా శీర్షిక

**చేత వెన్నముద్ద**

వచ్చే సంచిక నుంచే ప్రారంభం

బెడ్ షీట్లు మార్చడం థర్మామీటరు నోట్లో పెట్టి సిష్టరుకు అందించడం వొక టేమిటి సమస్తం చేసేస్తున్నారు.

తను క్రొత్తకేసుల్ని పరీక్షించి కేస్‌సీట్లు రాస్తున్నాడు. క్రొత్తకేసులు రాసింతర్వాత తనకు యెలాట్ చేసిన బెడ్‌లు రిపీట్ చేద్దామని వచ్చేడు.

ఆ కుంటి, గూనీ తనకు యెలాట్ చేసిన బెడ్‌లలోనే వున్నారు. మంచం దగ్గరకి వచ్చి కుంటి కేస్‌షీట్ చూసేడు. కుంటివాడి పేరు పోచయ్య. అతని కేస్‌షీట్ దుక్కగా అంచులు చుట్టేసి మాసిపోయి చిరుగులతో వుంది. అందులో ఎన్నో రకాల యింకులతో రిపీట్ అంటూ రాసి వుంది. ఏం రిపీట్ చేయాలో పుస్తకం మొదట్లో చూసేడు. అక్షరాలు చిరిగి పోయేయి.

అతనికి అర్థంకాక సిష్టర్ని పిలిచి 'యిది ఏం కేసు?' అన్నాడు.

"అదో రిపీట్ కేస్ డాక్టర్!" అంది.

ఈ సిష్టర్ విట్టియే అనుకుని 'అదిగాదు యితనికి జబ్బు ఏంటి?' అన్నాడు.

"తెలియదు డాక్టర్."

"పోనీ యితను యిక్కడకు వొచ్చి ఎన్నాళ్ళయిందో తెలుసా?"

"నేను యీ వార్డులో పోష్టయి ఆరు నెల్లయింది. అప్పటినించీ చూస్తూనేవున్నాను. అంతకు ముందు ఎన్నాళ్ళనించి వుంటున్నారో నాకు తెలియదు."

సరే అని మిగతా మంచాలు కూడా చూసి యిక యీ రోజుకు చాలు అనుకొని బయటికి రాబోయాడు.

"ఇంటికి పోతున్నారా'' అన్నాడు కుంటి వాడు.

"అవును" అన్నాడు తను.

"నమస్తే సార్ అన్నారు వాళ్ళిద్దరూ.

* * *

పంక్చ్యువాలిటీకి మారుపేరు రవి. అతను అలా గంట ఎనిమిది కొడుతూంటే యిలా వార్డులో కాలు పెడ్తాడు. అతను యీ రోజు కాలు పెట్టేటప్పటికే ఆచారి బెడ్ దగ్గర కూర్చుని ఎవర్నో సీరియస్‌గా పరీక్ష చేస్తున్నాడు.

తను దగ్గరికి వచ్చి విష్‌చేసి 'ఏంకేసు సార్!" అన్నాడు 'ఇది లూకీమియా కేసోయ్' అని రెండు నిమిషాల తర్వాత "రవీ యీ పేషంటుకి రక్తం ఏర్పాటు చేయాలోయ్, బ్లడ్ బాంక్‌లో ప్రయత్నించు" అన్నాడు.

బ్లడ్ బాంక్ అదో లోకం. అక్కడ రక్తం వున్నా మొదట లేదనేస్తారు. వాళ్ళని వొదల కుండా పీడిస్తే రక్తం యిచ్చి వొదిలించు కుంటారు చివరకు.

రవి తను వొక బాటిల్ అడిగితే వీళ్ళు లేదు పొమ్మంటారని రెండు బాటిల్సు అడిగేడు. వాళ్ళు లేదు కాదు అని నసిగి వొక సీసా యిచ్చేరు.

అప్పుడప్పుడు రక్తం సరిగ్గా ఎక్కుతుందో లేదో అని చూస్తూ వార్డు రవుండ్స్ పూర్తి చేసేడు.

వార్డుకి వెళ్ళగానే అక్కడ రాంబాబుగారు కనిపించేరు. తన్ను చూస్తూనే 'రవీ స్పెషల్ రూంలో సీతారామయ్యగారు అని ఎం.పి. వున్నారు. వారికి ఒక పెన్సిలిన్ ఇవ్వాలోయ్. ఇచ్చిరా నేను ఇక్కడనే వుంటాను' అన్నాడు.

సరే అని మందు సిరంజిలో యెక్కించి స్పెషల్ రూంకు వెళ్ళేడు. సీతారామయ్య భారీ విగ్రహం మనిషి. తన్ను చూస్తూనే 'రాంబాబుగారు యింజక్షను యిస్తేనే నేను తీసుకుంటాను' అని పట్టుబట్టేడు. తను తిరిగి వొచ్చి 'సార్ మీరే యివ్వాలట నేను ఇస్తే తీసుకోనన్నారు' అన్నాడు. రాంబాబుగారి ముఖంలో రంగులు మారేయి. తన హవుస్ సర్జన్ యిన్‌నల్లు తన పెర్సనల్‌గా తీసుకొని "సరే వీళ్ళకు యెలా బుద్ధి చెప్పాలో నాకు తెల్సు. రా నీచేతే యిప్పిస్తాను' అని సీతారామయ్య గదిలోకి వెళ్ళి అతనితో 'చూడండి! నేను సిరంజ్ ముట్టుకొని యిప్పటికి పదేళ్ళయింది. యింజక్షన్ ఎలా యివ్వాలో కూడా మరిచిపోయేను. నా హౌస్‌సర్జన్ రోజుకి వంద చొప్పున యీపాటికి వేలు యిచ్చివుంటాడు. వాళ్ళు యిస్తేనొప్పి కూడా పెట్టదు. నేను యిస్తే రేపు అది నొప్పయి వాచిపోతే నేను బాధ్యుణ్ణి కాను' అని 'రవీ సిరంజి తే' అన్నాడు.

"వొద్దులేండి డాక్టరుగారూ మీ హవుస్ సర్జన్నే యిమ్మనండి" అన్నాడు సీతారామయ్య, రాంబాబుగారు చిరునవ్వు నవ్వుకుంటూ వెళ్ళి పోయారు.

ఆ రోజునించీ రాంబాబుగారి మీద గౌరవం మరోమెట్టు అధికం అయింది.

* * *

మర్నాడు వార్డులో అడుగు పెట్టేటప్పటికి గూనివాడు, కుంటివాడు చాలా ఉషారుగా వార్డంతా తిరిగేస్తూ కనిపించేరు. తన్ను చూస్తూనే పరిగెత్తుకుంటూ దగ్గరికి వొచ్చి తన చేతిని తీసుకుని ముద్దు పెట్టుకుంటూ 'డాక్టర్ ఏం చెయ్యి డాక్టర్. యీ చెయ్యి పడితే సచ్చి పోయెవాడు కూడా లేచికూర్చుంటాడు సార్' అంటూ చేయిని విడవకుండా ముద్దులాడు తున్నారు.

తనకు చాలా సిగ్గనిపించింది. 'వారేయ్ ఆపండి ఇంతకీ ఎందుకేంటి ఈ ప్రదర్శన' అన్నాడు.

"నిన్న మీరు రాజుమీద చేయి వేసేరా, యీ రోజు వాడు ఎలా కూర్చున్నాడో చూడండి సార్' అన్నాడు.

"రాజు ఎవరేంటి?" అన్నాడు.

"నేను సార్'' అంటూ వొక పదహారేళ్ళ వాడు బెడ్ మీద నించి అరచి, "సార్ నన్ను గురుపట్టలేదా సార్" అన్నాడు.

"నీవు నిన్న ఎడ్మిట్ అయినవాడివి కదోయ్" అన్నాడు.

"నేను అంతకంటే పాతవాణ్ని, మీ ఎగ్జామ్ కేసుని."

అప్పుడు తనకు జ్ఞాపకం వొచ్చింది వీడ్ని సాధారణంగా పరీక్షల సమయంలో పిలుస్తూంటారు. పిల్లలు వీణ్ని పరీక్షిస్తే పరీక్షాధికారి ప్రశ్నలు అడిగి వాటికి తగిన సమాధానం యిస్తే పాసు చేస్తూంటారు. తన దురదృష్టం కొద్ది వీడు పరీక్షల్లో తనకే తగిలేడు.

ఆ రోజు వీడు తన్ను యెంత బాధించేడు. [illegible] నన, సార్ ఇద చూడండి సార్, అది వినండి సార్ అంటూ తనకు ఇన్‌ష్ట్రక్షన్సు యివ్వసాగేడు. దీన్ని అయిదు నిమిషాలు భరించి తర్వాత విసుగొచ్చి 'నువ్వు నేను అడగకుండా నోరు మెదిపితే తంతా' అన్నాడు.

ఆ రోజు తర్వాత ఈ రోజే చూడడం.

క్రిందటిసారి కంటే మనిషి బాగా క్షీణించి పోయేడు. ఇప్పుడు పదహారేళ్ళ అతని వయసుని చర్మం, ఎముకలే కప్పి వున్నాయి. కళ్ళ చుట్టూ నల్లవలయాలు. ఆ స్థితిలో కూడా అతని కళ్ళలో యేదో మెరుపు తనవాళ్ళ దగ్గర వున్నాం అనే సంతోషం.

"జ్ఞాపకం వచ్చిందోయ్" అన్నాడు కానీ ఈ పదహారేళ్ళవాణ్ని యీ స్థితిలో చూస్తూంటే బాధనిపించింది.

మర్నాడు వార్డులో కాలు పెట్టేటప్పటికి రాజు ఒక సంవత్సరం పిల్లని ఎత్తుకొన్నాడు. వాడిచుట్టూ గూనివాడూ, కుంటివాడూ చేరి సంతోషపడిపోతున్నారు. తను దగ్గరకు వచ్చి 'ఎవరోయ్ యీ పిల్ల' అన్నాడు.

పిల్లని ఆడిస్తూన్న ముగ్గురూ తలయెత్తి "మన ఆస్పత్రి పిల్లండి" అన్నారు వొక్కుమ్మడిగా.

తనకు అర్థంకాక 'అంటే' అన్నాడు.

'మన ఆసుపత్రిలో కనేసి యెవరో ఆ చెత్త కుండీ దగర పారేసి వెళ్ళిపోయారు. నేను చూసి తెచ్చుకున్నాను సార్. అప్పటినుంచీ ఆసుపత్రి పెంచుతూనే వుంది' అన్నాడు రాజు.

* * *

ఆసుపత్రిలో వాతావరణం అంతా బరువుగా అనిపించింది. గూనివాడు కుంటివాడూ తన్ను చూస్తూనే డాక్టరుబాబూ' అంటూ బావురుమన్నారు.

వాళ్ళు అలా ఏడుస్తూంటే తను వాళ్ళను అలా చూడలేనేమో అనిపించింది. అయినా మనోభావాలను బైటపడనీయకుండా 'ఏమైంది?' అన్నాడు.

"మన రాజండి, చాలా సీరియస్ అయి పోయేడు" ఎకాయెకి అన్నారు.

"ఏమయిందేంటి?" అన్నాడు

"చూడండి బాబూ యెలా పచ్చగా అయి

పోయాడో, నవ్వుతూ వుషారుగా వుండేవాడు, ఎలా మగతగా కళ్లు మూసుకుంటున్నాడో?" అన్నారు.

తను పరీక్షించేడు. అతని శరీరం ఎక్కించిన రక్తాన్ని తీసుకోలేదు. అందుకే రక్తం విరిగిపోయింది. వళ్ళంతా పచ్చగా కామెర్లతో నిండిపోయింది.

తను దగ్గరకివచ్చి మంచంమీద కూర్చుంటూ 'రాజూ' అని పిలిచేడు. వాడు కళ్ళుతెరచి తన్ను చూసి పల్చటి పెదాలమీద సన్నని నవ్వు చిందిస్తూ 'డాక్టర్ యీసారి పరీక్షలదాకా నేను బ్రతుకుతానా?' అన్నాడు.

"నువ్వు బ్రతుకుతావు రాజూ" అంటూ అతని చేతిని తన చేతిలో తీసుకుంటూ తన బలం అతనిలో ఎక్కిస్తూన్నట్టు పట్టుకున్నాడు గట్టిగా.

"నాకు బ్రతకాలనే వుంది డాక్టర్. కాని నేను పరీక్షలదాకా బ్రతకను. నా రోజులు దగ్గర పడ్డాయి డాక్టర్."

"రాజూ అలా మాట్లాడకు" అంటూ అతని పెదాల్ని తన చేతులతో మూయబోయాడు.

ఆ చేతుల్ని తప్పించుకుంటూ "డాక్టర్ నాది బ్లడ్ కాన్సరు అని రెండేళ్ళక్రిందట అన్నప్పుడే చచ్చిపోదాం అనుకున్నాను. తర్వాత నాకు తెలిసింది. నాకూ వొక ప్రయోజనమంటూ వుందని. అదే వైద్య విద్యార్థులకు పాఠం కావడం. ఈ శరీరాన్ని వాళ్ళ విజ్ఞానానికి ఉపయోగపడేటట్టు చేయడం. అందుకే ప్రతీ పరీక్షలో యెగ్జామ్ కేసు అయేవాడ్ని" అన్నాడు.

ర ర ర

ఆరోజు మంగళవారం.

తమ వోపీ రోజు. తమకు అన్యాయం జరగదుఅన్న ధీమాతో వచ్చే ఆ పేషంట్లు కళ్ళ ముందు మెదిలేరు. ఆ తర్వాత తన్ను హృదయపూర్వకంగా పలుకరించే ఆ గూనివాడు, కుంటివాడూ, ఆ తర్వాత రాజు. ఉదాత్తభావాల పదహారేళ్ళ బ్లడ్ కాన్సరు పేషంటు. పాపం ఎలా వున్నాడో, అతను బ్రతికే ఆశ లేదని ఆరోజే ఆచారి చెప్పేసాడు. ఆలోచనలు ఉవ్వెత్తు తరంగాల్లా లేస్తూంటే ఆసుపత్రిలో మోటారు సైకిలాపి వోపీకి వెళ్ళాడు. వోపీకి ముందు పెద్ద క్యూ వుంది.

పదినిముషాల తర్వాత కొత్త బాస్ వరదరావు 'రవీ!' అంటూ పిలిచాడు. తను కుర్చీలోంచి లేచి దగ్గరగా వచ్చి 'ఏం సార్!' అన్నాడు.

"ఏంలేదోయ్ వీరిని వార్డుకి తీసుకెళ్ళి యూరిన్ పరీక్షించి, షుగర్ వుందో లేదో నాకు వెంటనే వచ్చి చెప్పు."

"సరే" అంటూ తల ఊపి బయలుదేరాడు.

అసలు వోపీ టెష్టులకు టెక్నీషియన్స్ అంటూ వుంటారు. అలాంటిది ఒక హౌస్ సర్జను తీసుకెళ్ళటం బాగుండదు అన్న ఆలోచన రాలేదు.

పదకొండు గంటలకు ఆచారి వెంబడే కాఫీకి బయలుదేరేడు. "సార్ రాజు ఎలా వున్నాడుఆచారిముఖంవివర్ణం అయింది. 'రాజు యిప్పుడు ఆసుపత్రిలో లేడోయ్. మెడికల్ కాలేజీలో శవాలమధ్య తనూ ఒక శవం అయి విద్యార్థులకు పాఠాలు నేర్పిస్తున్నాడోయ్' ఆచారి కంఠం కొంచెం ఒణికింది. రవికి 'ది డెడ్ టీచ్ ది లివింగ్' అన్న సామెత జ్ఞాపకం వొచ్చింది.

వార్డు చీఫ్ తనకో పదిబెడ్లు ఎలాట్ చేసేడు. ఆ కేసులు చూసి అందరికీ యింజక్షన్లు ఇచ్చి వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కుంటున్నాడు.

ఇంతలో తను యింజక్షన్ యిచ్చిన పేషంటుని వార్డుచీఫ్ పన్నగా 'ఇంజక్షన్ తీసుకున్నావా వేణూ' అంటూ అడిగేడు.

"ఇచ్చేరు సార్ హౌస్ సర్జనుగారు" అన్నాడు.

"ఏ రంగు యింజక్షను యిచ్చేరేంటి?" అన్నాడు చీఫ్. రవి మనసు బాధగా మూల్గింది.

చీఫ్‌కి తాము యిచ్చే దానిమీద నమ్మకం లేదన్నమాట. అతను రాసింది యిచ్చేమో లేదో అన్న అనుమానం పుచ్చుకున్న వాళ్ళనించి నివృత్తి చేసుకుంటే, హౌస్ సర్జనుగా తమ యిమేజ్ ఏం వుంటుంది.

ఎందుకు యింత పెద్ద చదువులు చదివి పెద్ద హోదాల్లో వున్న వ్యక్తులు యిలా ప్రవర్తిస్తారు? యీ ఆసుపత్రులు ఏం అవుతున్నాయి? ఇందులో లోపం ఎక్కడ ఉంది? ఎన్నో శృంగ దీసే ప్రశ్నలు వొస్తున్నాయి, భారంగా వార్డు నుంచి కదిలిపోయే రవికి.... □

